'కెవ్వుమ్మయ్యో!' అని గావుకేక పెట్టి సీటుమీదనుంచి నేలకు ఒక్క గెంతు గెంతింది ప్రసూన.

ఇరవై ఏళ్ల అమ్మాయి—అందమయిన అమ్మాయి చదువూ సంస్కారమూ కల్గిన యువతి—అంత మంది మగాళ్లలో ఒక్కగానొక్క చక్కని చుక్క ఆఫీసులో పట్టపగలు గెంతడం అంటే రోజూ జరిగే సంఘటనా?

ప్రసూన కేక విని—

బుర్ర గోక్కుంటూవుండి తలపాగా తీసిన మేనేజర్ లక్ష్మీపతి తలపాగా పెట్టుకోనూ లేదు; బుర్ర గోక్కోనూ లేదు.

పెన్సిలు చెక్కుతున్న గుమాస్తా సుబ్రహ్మణ్యం పెన్సిలు జారవిడిచి, పెన్సిలే అనుకుని వేలిని చెక్కుకున్నాడు.

డిస్పాచర్ రంగా 'ఫెయిర్ కాపీ' మీద 'డిస్పాచ్డ్' అన్న స్టాంపు గుద్దేశాడు.

ప్యూను వరదయ్య కవర్‌కు అంటిద్దామని నాలుకతో తడిచేస్తున్న బిళ్ల స్టాంపును నాలుకమీదే వుంచి నోరు మూసుకున్నాడు.

—ఆ కేక విని లక్ష్మీపతిగారు గబగబా వెళ్లి "అమ్మాయ్! ఏమిటది?" అని కాస్త గట్టిగా అడగా లనుకుని అడిగారు.

ప్రసూన వణికిపోతూ డ్రాయరు వైపు వేలు చూపుతూ వుంది. ఒకటో రెండో ఫైళ్లు క్రిందపడి వున్నాయి. సిరాబుడ్డి ఒలికిపోయింది. ఏదో జవాబు చెప్పాలని ప్రయత్నించింది ప్రసూన.

"ఎందుకలా కేక పెట్టావ్?" మళ్లీ మేనేజరు. ఆఫీసంతా ఆతృతతో వున్నారు. ఆ అమ్మాయి నోట నుండి ఏమి రాలుతాయో అని.

"—డ్రాయర్ తాళం తీసేసరికి గబుక్కున దూకి తిన్నగా వెళ్ళిపోయిందండీ—"

"ఏమిటది?"

"అదేనండీ! బొగ్గులా నల్లగా, వెధవది దానికీ తోకా, బారెడు మీసాలూ దాన్ని చూస్తే నాకు పరమ భయం—"

"ఏమిటమ్మా అది? తేలా?"

"మీసాలున్న తేళ్లు కూడా వున్నాయాండీ?"—గుమాస్తా సుబ్రహ్మణ్యం సందేహాన్ని వెలిబుచ్చాడు.

"ష్! నువ్వూరుకోవోయ్—ఏమమ్మాయ్—"

"అదేనండీ! దాని పేరు చెప్పడమంటేనే రోతగా వుంది—"

"ఎలుకా?"

"ఆ—అదే"

"అమ్మయ్య! దానికా ఇంత—"

"దానికా"—ఏమిటండీ? ఆఫీసు డ్రాయరు తీయగానే ఎలుకలా—అందులో పైకి గెంతే రకాలా? ఇదేమంత చిన్న విషయం కాదండోయ్—" అంది ప్రసూన. ఆ కంపెనీ డైరెక్టర్ల ఒకరి మరదలు ప్రసూన.

లక్ష్మీపతి ఫ్యాను క్రింద తన సీటులో చేరగిలబడ్డారు. ఏదో గబుక్కున గుర్తుకొచ్చింది. 'ఇందాక అనుకుని శాంతపరచటమే మరిచేపోయాను. నా మతి మరుపు!—' అని తొందర తొందరగ బుర్ర గోక్కుని తలపాగ పెట్టుకున్నారు.

"అప్పుడండీ మొన్న బెజవాడ బ్రాంచి నుండి వచ్చిన ఇన్‌డెంట్ కాపీని—ఎలుకలే తినేశాయి. అందులోనూ—అప్పుడియ్యా—ఎంపదార ఇండెంటేమో మొత్తం తినేశాయి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఆ—రోజా ఒక పేపరు కనబడకపోయే నీకు ఇదో సాకు" అన్నారు లక్ష్మీపతి

"అదే కాదండీ—స్టేషనరీ అంతా నాశనమవుతూంది. పక్కలు కొరికేసిన 'ట్రాక్' లు తెగిన ఫైళ్లూ—ఇవన్నీ ఎలుకల ఫలితమేనండీ" అన్నాడు గుమాస్తా.

"ఆ—ఆ -- పని చూడండోయ్"

"మీరు మట్టుకు వెంటనే ఏదయినా చర్య తీసుకోవాలండోయ్"—ఒలికిపోయిన సిరాను బ్లాటింగ్‌తో అద్దుతూ ప్రసూన.

"అలాగే, అలాగే" అంటూ పనిలోకి జారిపోయారు లక్ష్మీపతి.

'అవును. నిజమే. ఆఫీసులో ఎలుకలు ఎక్కువయి నక్కి వున్నాయి. మొన్నటిసారి హెడ్డాఫీసు నుంచి ఓ వుత్తరం వస్తే, దానికి 'అర్జంట్ స్లిప్' తగిలించి మరుసటి రోజు ఏజెంట్ ఎదుట పెడదామనుకున్నాను. పొద్దున వచ్చి చూద్దునుగదా ఒక మూల మూలంతా కొరికేసి వుంది!—రోజూ సరేసరి—డ్రాయర్లలో చిన్న చిన్న కాగితాల ముక్కలూ, భరించలేని కంపూ—నిజమే. వెంటనే చర్య తీసుకోవలసిందే. వెధవ ముండా ఎలుకలు పగలెల్లా కన్పడవు. రాత్రవగానే ఎక్కణ్ణుంచో వస్తాయి. వచ్చి ఈ ఆఫీసు కాగితాలే నమిలియాడవక పోతే ఏ పేపరాఫీసుకో పోకూడదూ? అయినా ఏం కలియుగమో -- ఈ ఎలుకలక్కూడా బొత్తిగా బుద్ధి యుక్తి జ్ఞానం పోతూంది.'

సాయంత్రం లక్ష్మీపతి ఘూర్కావాడిని పిలిచి చివాట్లు పెట్టారు. పాపం, వాడు హిందీ, తెనుగూ కలిపి ఏదో అన్నాడు—బహుశా "హా! జగదేక వీరులయిన మేము—ఆఖరికి ఎలకల మూలంగా దూషణకు పాత్రులు మయితిమిగదా? ఛీ" అని వుండొచ్చు.

కొన్ని రోజుల తరువాత—పరిస్థితి అలాగే వుంది. ఎలుకలదాడి ఎక్కువవుతుందేగాని తగ్గలేదు. స్వైరవిహారిగా ఎలుకలు పట్టపగలే కనబడసాగాయి.

మేనేజరూ, ఏజెంటూ కలిసి హెడ్డాఫీసుకి ఎలుకల బాధ విపరీతమయిపోయిందని—రాశారు—

చీఫ్ డైరెక్టర్ గారు పర్సనల్‌గా ఏజెంట్‌కి 'ఈ మాత్రం తెలీదా? ఆఫీసులో ఒక పిల్లిని పెంచ కూడదా అని రాశారు.

ఏజెంటు మేనేజరుని పిలిచి చెప్పాడు. మేనేజరు "హా! ఎంత దురదృష్టండీ దేవుడా! రోజూ పొద్దున రాగానే దీని ముదనష్టపు మొహం చూడాలి కాబోలు" అని వ్యసనపడ్డారు.

చిన్న పిల్లిని పట్టుకొచ్చారు. పాలూ రొట్టె పెట్టి పెంచారు. పిల్లి చక్కగా బొద్దుగా పెరిగింది. "హా! పిల్లి మేలు కదా నా కన్నా" అని వాపోయేడు అకౌంట్సు గుమాస్తా శంకరం.

పిల్లి పోషణ నెలకి పదమూడు రూపాయల చిల్లర ఖర్చవుతుంది. ఆ ఖర్చంతా ఏ హెడ్ ఆఫ్ అకౌంట్ క్రింద వేసుకోవాలి—అన్న విషయం మీద—

"ఎలుకలు ఈ బిల్డింగులోనివే గనుక—'బిల్డింగ్స్ ఛార్జెస్' క్రిందికి రావాలి" అని మేనేజరు అంటే—

"నాన్సెన్స్! స్పెషల్‌గా అకౌంట్స్ టెస్టు పాసయిన వెధవని నేనున్నానుకదా, నాకామాత్రం తెలీదా? ఈ ఖర్చులు మధ్యలో అనుకోకుండా వచ్చినవి కనుక 'ఎక్స్—కంటింజెన్సీస్' క్రిందకే రావాలి" అన్నాడు అకౌంటెంట్ సాంబ.

వాళ్లిద్దరూ గంటన్నరసేపు గొంతులు చించుకున్నారు. ఆ అరుపులకి చిన్న చిన్న పిల్ల ఎలుకలు కనీసం అరడజను చచ్చివుంటాయని గుమాస్తా ఆ రోజు రాత్రి తన డైరీలో వ్రాసుకున్నాడు.

అకౌంటెంట్ ట్రాన్స్‌ఫర్‌కు అర్జీ పెట్టాడు.

'హెడ్ ఆఫ్ అకౌంట్' విషయం హెడ్డాఫీసుకి నివేదించారు. ఎలుకలు అలాగే వున్నాయి—

ఉన్నట్టుండి ఒక రోజు పిల్లి కన్పడలేదు. అందరూ తెగవెతికారు. లక్ష్మీపతిగారు గంటకోసారి తలపాగ తీసి, బుర్ర బాగా గోక్కుని మళ్లీ పెట్టుకున్నారు.

అయినా పిల్లి సత్తా లేదు.

"పెద్దల్ని పెంచుద్దామంటే పిల్లి తాలూకు ఫోటో—కనీసం పాసుపోర్టు సైజుదయినా తీయించారుగారు" అని జనాంతికంగా అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఒక రోజు—బాత్ రూమ్‌లో బస్కీలు ఒడ్డుపీద తీసుకుంటూండగా లక్ష్మీపతిగారికో దారి కన్పించింది. గబగబా బట్టలు తొడిగేసుకుని, భోజనం కూడా మానేసి, బస్సుకోసం కాచుకోక, టాక్సీ చేసుకుని ఆఫీసు కెళ్ళిపోయి ప్యూన్సు నరసయ్య, వెంకటప్పలను, హుటాహుటిని పిలిచి ఇలా అన్నారు:

"రేపటి నుంచి—అప్పో—ఇవాళనుంచే మీరు ఎలకలు పట్టండి. అవును—ఎలకల్నే పట్టండి. ఎలా పట్టుకున్నా సరే. ఎలకకు బేడ చొప్పున కంపెనీ బహుమతి ఇస్తుంది."

"ఎలకలు చచ్చినా, బ్రతికినా బేడేనా బాబూ!"—నరసయ్య అడిగాడు.

"ఆ—మీరు రాత్రిళ్ళు కూడ ఇక్కడ వుండొచ్చు.

"మరయితే పొద్దున్నపూట పని మానేయమన్నా?" అని వెంకటప్ప అడిగాడు.

"ఏడిశావు. పొద్దునా సాయంత్రమూ ఎలకల్ని పట్టవోయ్—ఎలకకు బేడ—అంటే ఓ కాఫీ—ఎంత లేదన్నా ఈ ఆఫీసులో కనీసం రెండుమూడొందల ఎలకలుంటాయిలే" అన్న ఆశాభావం వెలిబుచ్చాడు నరసయ్య—

మూడో రోజు పొద్దున వెంకటప్ప వచ్చి మేనేజర్ ఎదుట నిల్చుని "సార్" అన్నాడు.

"ఏమిటి?" అన్నారు లక్ష్మీపతి.

"నాతో రండి."

"ఎందుకూ?"

"ఎలకలు పట్టానండి"

"నిజంగానే!! ఎన్ని?"

"తొమ్మిదండి! మహా ప్రయాసనీ పట్టాను—నిన్న రాత్రి."

"పద పద."

వరండాలో బెంచిమీద తొమ్మిది బోనులున్నాయి. ఒక్కొక్కదానిలో ఒక్కొక్క ఎలక వుంది. లక్ష్మీపతి వెంకటప్ప వీపు తడుతూ "శభాష్! ఇహ వీటి పొగరు అణిగిందిలే. లేకపోతే నా ఆఫీసులో తాండవమాడుతాయి—తాండవం! హు—వెంకటప్పా—అక్కౌంట్సు బ్రాంచికి వెళ్ళి వోచర్ ఇచ్చేసి రూపాయి బేడ పుచ్చుకో—"

వెంకటప్ప వెళ్ళిపోయాడు.

ఇంతలోకే "సార్!" అంటూ నరసయ్య రిక్షాలోంచి దిగుతున్నాడు. "లోపలికి పట్టుకురావోయ్!" అని రిక్షావాడితో చెప్పి నరసయ్య వరండాలోకి వచ్చి మేనేజరు ఎదుట నిల్చున్నాడు."

"ఏమిటోయ్?" అన్నారు లక్ష్మీపతి.

రిక్షావాడు ఎడంచేత్తో మూడూ, కుడిచేత్తో నాలుగూ ఎలకబోన్లు పట్టుకొచ్చి క్రింద దింపి, మళ్ళీ ఒక వరస పట్టుకురావడానికి కాబోలు వెళ్ళాడు.

"నీవు కూడా ఎలకలు పట్టావేమిటి?"

"నీవూ కూడా" అని మేనేజర్ అడగడంలో అంతరార్థం అవగాహనకాక కుడివక్కకు చూశాడు నరసయ్య. బెంచిమీద వెంకటప్ప పెట్టిన బోన్లు కనుపించాయి.

బాధతో—"బోనండి!" అన్నాడు నరసయ్య.

"మొత్తం ఎన్ని పట్టావూ?"

"పద్నాలుగండి."

"ఎప్పుడూ?"

రాత్రి పట్టానండి. పొద్దునే ఇంటికి తీసుకెళ్ళి నాను—ఇప్పుడు పట్టుకొస్తున్నానండి."

"మరి నిన్న రాత్రే నరసయ్యకూడా పట్టాడట?"

"అవతలి వైపు అతడు పెట్టినట్టున్నాడండి—మరి ఎలకకి బేడ చొప్పున—"

"లోపలికి పద—"

—మేనేజరుకి ఎందుకో సందేహం వచ్చింది. "ఒక్క రాత్రిలో దాదాపు పాతిక ఎలకలు పట్టుబడ్డాయా? ఈ ఎలుకలు మరీ అంత తెలివితక్కువవా—ఇహ—"

రిక్షావాణ్ణి పిలిపించి అడిగారు. గత రాత్రి కాదు గదా, మూడు రాత్రిళ్ళనుంచి నరసయ్యగాని, వెంకటప్పగాని ఆఫీసు వైపు రాలేదని వాడు చెప్పాడు!

నరసయ్య, వెంకటప్పలను సస్పెన్షన్‌లో వుంచి ఆఫీసుకోసం మరో ఇల్లు వెతుకుతున్నారు లక్ష్మీపతిగారు.


ఉగాది స్పెషల్ ఆఫర్

# గెలవండి 65,000 గెలవండి

రిజిస్టరు నెం. 637 పోటీ నం. ఎస్-1

మా సీలువేసిన కీ సొల్యూషను ది నెడుంగాడి బ్యాంక్ లిమిటెడ్, మద్రాసు-1 యందు వుంచబడింది. అది వారి అధికారంతో ప్రకటింపబడును. మొదటి బహుమతి ఆల్ కరెక్టు రు. 32,500/- రెండవబహుమతి మొదటి రెండు లైనులు కరెక్టుకు రు. 16,250/- 3 వ బహుమతి మొదటి ఒకలైను కరెక్టుకు రు. 8,125/- 4 వ బహుమతి మొదటి రెండుఅంకెలు కరెక్టుకు రు. 4,063/- (మా ఆఫీసు యుల్ కీసొల్యూషనుతో సమానంగా నిలువుగాను, అడ్డంగానువుండవలెను) 5వ బహుమతి రు. 4,062/- ఎక్కువఎంట్రీలుపంపినవారికి.

70

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

కడపటి పోస్టింగు తేది 11-3-57

ఫలితములు 21-3-57

ప్రవేశ రుసుము.

ఒక్కొక్క ఎంట్రీకి రు. 1/-; 7 ఎంట్రీలకు రు. 5/-;

మొత్తం 62

| | | | |
|---|---|---|---|
| 20 | 21 | 10 | 11 |
| 15 | 8 | 23 | 16 |
| 18 | 19 | 12 | 13 |
| 9 | 14 | 17 | 22 |

16 ఎంట్రీలకు రు. 10/-; 50 ఎంట్రీలకు రు. 26/-; ప్రతి 100 ఎంట్రీలకు రు. 45/-.

పూర్తిచేసే విధం: ఈ చతురంలో 10 మొదలు 25 వరకు అంకెలువాడి అడ్డంగాను, నిలువుగాను, మూలగాను ఎటుకూడినా 70 వచ్చేట్టు పూర్తిచేయండి. ఒక్క సంఖ్య ఒక్కసారే వాడవలెను. సాదా కాగితంమీద ఎన్ని ఎంట్రీలైనా పంపవచ్చును. పంపేవారు తమ పేరు, అడ్రస్సు, అంకెలు విస్పష్టంగా ఎంట్రీలో ఇంగ్లీషులో వ్రాయవలెను. రుసుము, ఇండియన్ పోస్టల్ ఆర్డరుద్వారాకాని, బ్రిటిష్ పోస్టల్ ఆర్డరుద్వారాకాని, మనిఆర్డరుద్వారాకాని పంపవలెను. పంపేవారు తమ పేరు, అడ్రసు ఇంగ్లీషులో ప్రతి మనిఆర్డరు కూపనులోనూ వ్రాయవలెను. ఎంట్రీతోపాటు ఎం. ఓ. రశీదులు జతపరచి పంపాలి. బహుమతుల మొత్తం వసూళ్ళను బట్టి మారును. మేనేజరు తీర్పు ఖాయమైనది. చట్టసమ్మతంగా బద్ధమైనది. మా రూల్సు షరతులు పూర్తిగా తెలిసినవారే పోటీలో పాల్గొనవలెను. నాలుగు అణాలు ఇండియన్ పోస్టేజి స్టాంపులు పంపినవారికి ఫలితములు తెలియజేయబడును. మీ ఎంట్రీలు దిగువ అడ్రసుకు పంపండి!

**RAYAL COMPETITIONS** 73, (A W) ACHARAPPAN STREET, MADRAS-1.